ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 16 మార్చి 2024





• బోసిపోయిన నగరంలోని కవిత కార్యాలయం



• నగరంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

నిరసన జ్వాల

- ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం
- ప్రధానికి వ్యతిరేకంగా పార్టీ శ్రేణుల నినాదాలు

సుభాష్‌నగర్, మార్చి 15: లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ భారత జాగృతి, బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద "మోదీ, కేడీ" అంటూ.. ప్ల కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భారత జాగృతి నాయకులు మాట్లాడుతూ.. రాజకీయంగా ఎదుర్కొనలేకనే బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేశారని, ఈడీ నోటీసులంటూ సంవత్సరకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ ధర్నాలో భారతజాగృతి నాయకులు భరద్వాజ్, అపర్ణ, రేహాన్, పులిజైపాల్, బీఆర్ఎస్‌వీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌కు భారీ షాక్





- ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత అరెస్టుతో షాక్‌కు గురైన బీఆర్ఎస్ జిల్లా శ్రేణులు
- పార్లమెంట్ ఎన్నికల వేళ పార్టీకి భారీ నష్టం జరుగుతుందని అంచనా
- బీఆర్ఎస్ పార్టీ నేతల్లో మొదలైన ఆందోళన
- బోసిపోయిన జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కవిత కార్యాలయం

నిజామాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఢిల్లీ లిక్కర్‌స్కామ్ కేసులో హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడంతో ఉమ్మడి జిల్లాలోని పార్టీ నేతలు షాక్‌కు గురయ్యారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉండడంతో పాటు పార్టీలో కీలకంగా ఉన్న ఆమె అరెస్టు కావడంతో.. క్యాడర్‌తో పాటు సీనియర్ నేతలూ కూడా ఆందోళనకు గురవుతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేయడం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో సంచలనం సృష్టించింది. ఈ వ్యవహారం ఉదయం నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలోని బీఆర్ఎస్ శ్రేణుల్లో అలజడి సృష్టించగా.. సాయంత్రానికి అరెస్టు వార్త రావడంతో షాక్‌కు గురయ్యారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీగా ఉండడం.. మాజీ సీఎం కూతురు కావడం, పార్టీలో పట్టుండటం వల్ల క్యాడర్ ఈ అరెస్టును జీర్ణించుకోలేదు. పూర్తిస్థాయిలో వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పార్టీ ఆదేశాలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఒక వెలుగు వెలిగి..

ఎమ్మెల్సీ కవిత ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒక వెలుగు వెలిగారు. ఆమె 2014 నుంచి 2019 వరకు ఎంపీగా పనిచేశారు. జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో ఢిల్లీలో చక్రం తిప్పారు. జాగృతి సంస్థ అధ్యక్షురాలిగా ఉంటూ రాష్ట్రంలో తనకంటూ ఒక వర్గాన్ని తయారు చేసుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందిన ఆమె తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఆమె ఎన్నికయ్యారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పార్టీ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పార్టీ నేతలకు అండగా ఉన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజకవర్గాల ఇన్‌చార్జీగా ఉండి ప్రచారం చేశారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ వస్తున్న వేళ ఆమె పార్లమెంట్ అభ్యర్థి తరఫున ప్రచారం చేసుకునేందుకు సన్నద్ధమవుతుండగా ఈ అరెస్టు జరగడం అందరినీ షాక్‌కు గురి చేసింది.

నగరంలో ప్రత్యేక కార్యాలయం

ఎంపీగా ఉన్న సమయంలో నిజామాబాద్‌లోనే ఉంటూ ప్రత్యేక కార్యాలయాన్ని నగరంలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసుకున్నారు. ఆ కార్యాలయం ద్వారానే పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటికీ ఎమ్మెల్సీగా ఉండడంతో ఈ కార్యాలయం కొనసాగుతోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కార్యాలయం వద్ద నిత్యం వందలాది కార్యకర్తలతో పాటు ప్రజలు వివిధ పనుల కోసం వచ్చేవారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీ అధికారానికి దూరమైన సమయం నుంచి ఎక్కువ మంది రావడం లేదు. ఆమె కూడా హైదరాబాద్‌కే పరిమితం కావడం వల్ల కార్యాలయం బోసిపోతోంది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు వస్తున్న వేళ మళ్లీ కార్యాలయం నుంచే కార్యకలాపాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్న వేళ.. కవిత అరెస్టు ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలకు షాక్‌ను ఇచ్చింది. మరో వారంరోజుల లోపు జిల్లాకు వచ్చి అన్ని నియోజకవర్గాలకు తిరిగేందుకు సన్నద్ధమవుతున్న వేళ ఈ అరెస్టు పార్టీ నేతలకు అలజడులకు గురి చేస్తుంది.

పార్టీ క్యాడర్ ఆందోళన

పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడంతో పార్టీ క్యాడర్ ఆందోళన చెందుతోంది. ఆమె అరెస్టు ప్రభావం నిజామాబాద్ పార్లమెంట్‌తో పాటు ఇతర నియోజకవర్గాలపైనా పడుతుందని భావిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ఒకరోజు ముందు అరెస్టు చేయడం వల్ల పార్టీకి తీరని దెబ్బే అని ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు అంచనా వేస్తున్నారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు మాత్రం పార్లమెంట్ పరిధిలోనూ నిజామాబాద్, జగిత్యాల జిల్లాలో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నేతలు భావిస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్‌కు కూడా భారీ నష్టాన్ని కలిగిస్తుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో కవిత అరెస్టు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు లాభిస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు.. అరెస్టుపై పార్టీ జిల్లా సీనియర్ నేతలు మాత్రం పూర్తిస్థాయిలో ఇంకా స్పందించడం లేదు.

రైతుల రాస్తారోకో

• నాసిరకం విత్తనాలు సరఫరా చేశారని ఆందోళన

కోటగిరి, మార్చి 15: నాసిరకం విత్తనాలను వేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోయామంటూ రైతులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలో శుక్రవారం గ్రోమోర్ కంపెనీ నాసిరకం విత్తనాలు ఇవ్వడంతో నష్టపోయామంటూ రైతులు రాస్తారోకో చేపట్టారు. రెండునెలల క్రితం గ్రోమోర్ కేంద్రంలో గంగా కావేరి వరి రకం విత్తనాలను కావాలని అడిగితే కంపెనీ నిర్వాహకులు ఇతర రకం విత్తనాలను అందించారని రైతులు తెలిపారు. ఆ విత్తనాలను నాటితే పంట చేతికి రావాల్సిఉండగా నేటికి పొట్ట దశకు రాలేదని రైతులు వాపోయారు. ఇతర వరి వంగడాలు ఈ పాటికే పొట్ట దశకు వచ్చాయని, తాము కొనుగోలు చేసి గ్రోమోర్ విత్తనాలు మాత్రం పొట్టదశకు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై అటు గ్రోమోర్, ఇటు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి పైరుతో గ్రోమోర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గ్రోమోర్ కంపెనీపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు ఉన్నతాధికారులతో పాటు గ్రోమోర్ కంపెనీకి సమాచారం అందించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రెండు రోజుల్లో గ్రోమోర్ అధికారులను పిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు గజేందర్, గంగాధర్, సాయిబాబా ఉన్నారు.



కోటగిరిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

తాగునీటి పరిస్థితిపై సమీక్ష

నిజామాబాద్, మార్చి15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో తాగునీటి పరిస్థితిపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీక్ష సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో పాటు మున్సిపల్ కమిషనర్‌లు, మిషన్ భగీరథ ఇంజనీర్లు పాల్గొన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులను కోరారు. జిల్లాలోని అలీసాగర్, బెల్లాల్ చెరువులతో పాటు ఇతర తాగునీటికి ఉపయోగపడే చెరువులన్నీ నింపి వచ్చే వర్షాకాలం వరకు తాగునీటికి ఇబ్బంది ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నిజామాబాద్ నగరం, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా సక్రమంగా కొనసాగించాలని కోరారు. ముందే తాగునీటి నిల్వలను ఉంచుకుంటే వచ్చే మూడునెలల వరకు ఇబ్బందులు రావని ఆయన అధికారులకు సూచించారు. అప్పటి వరకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముందస్తుగానే అన్ని మండలాల పరిధిలో చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



• బోధన్ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

సమస్యల వలయంలో గ్రంథాలయాలు

- కనీస వసతులు, సిబ్బంది లేక పాఠకులకు తప్పని ఇక్కట్లు
- ప్రభుత్వ నోటిఫికేషన్లతో లైబ్రరీలకు నిరుద్యోగుల పరుగులు
- పోటీ పరీక్షలకు అందుబాటులో లేని పుస్తకాలు
- పాత పుస్తకాలతోనే కుస్తీ పడుతున్న నిరుద్యోగులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బోధన్ రూరల్, మార్చి 15: జిల్లాలోని గ్రంథాలయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పలు గ్రంథాలయాల్లో సిబ్బంది, అవసరమైన పుస్తకాలులేక ఉద్యోగ సాధనలో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌లు ప్రకటించడంతో నిరుద్యోగుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. అయితే గ్రంథాలయాల్లో ప్రస్తుత పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి అప్‌డేట్ పుస్తకాలు అందుబాటులో లేక పోవడంతో అభ్యర్థులు పాత పుస్తకాలతోనే కుస్తీ పడుతున్నారు. అలాగే గ్రంథాలయాల్లో పూర్తిస్థాయి ఉద్యోగులు లేక ఇన్‌చార్జిలతోనే శాఖా గ్రంథాలయాలను నెట్టుకొస్తున్నారు.

నిరుద్యోగుల పరుగులు..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరిన నేపథ్యంలో మెగా డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో యువత గ్రంథాలయాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో కొన్ని రోజులుగా గ్రంథాలయాలు సందడిగా కనిపిస్తున్నాయి. కానీ అక్కడ శాశ్వత సిబ్బంది లేక వెక్కిరిస్తున్న ఖాళీలతో వాటి పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దీంతో నిర్వహణ కొరవడి అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

గ్రంథాలయాల్లో కానరాని ఉద్యోగాల భర్తీ

కొనేళ్లుగా జిల్లాలోని గ్రంథాలయల్లో ఉద్యోగుల నియామకాలు జరగలేదు. గ్రంథపాలకులు మొదలుకొని స్వీపర్ల వరకు అనేక ఖాళీలు ఏర్పడ్డాయి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే ప్రభుత్వం నెట్టుకువస్తోంది. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉన్నారు. సిబ్బంది కొరతవల్ల వారిపై అదనపు పనిభారం పడుతోంది. కొన్ని శాఖా గ్రంథాలయాల్లో స్వీపర్లే ఇన్‌చార్జి గ్రంథపాలకులుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల ఒకే ఉద్యోగి రెండు, మూడు గ్రంథాలయాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. గ్రంథపాలకులు లేని రోజుల్లో అటెండర్లు లేదా స్వీపర్లు గ్రంథాలయాన్ని తెరిచి దినపత్రికలను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు.

> జిల్లాలోని నిరుద్యోగ యువతను విజ్ఞానవంతులుగా, ఉద్యోగస్తులుగా చేయడంలో కీలక భూమిక పోషించే గ్రంథాలయాలు సిబ్బంది కొరతతో కునారిల్లుతున్నాయి. పోటీ పరీక్షల సిలబస్‌కు అనుగుణంగా పుస్తకాలు అందుబాటులో లేక అభ్యర్థులకు పాతపుస్తకాలే దిక్కవుతున్నాయి. దీంతో పోటీ పరీక్షల్లో ఆశించిన ఫలితం దక్కడం లేదని నిరుద్యోగ యువత వాపోతోంది. కాగా, వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లను జారీ చేస్తున్న పభుత్వం.. గ్రంథాలయాల్లోని ఖాళీలను పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

కనీస వసతుల కరువు..

జిల్లాలోని కొన్ని గ్రంథాలయాలకు అరకొర నిధులు ఇవ్వడం మినహా వాటి అభివృద్ధికి పెద్దగా చర్యలు తీసుకోలేదు. మున్సిపాలిటీ నుంచి గ్రంథాలయాలకు వచ్చే సెస్సే వాటికి ఆర్థిక వనరు. అవి చెల్లించే నిధులతోనే ఏదోవిధంగా నెట్టుకొస్తున్నాయి. గ్రామాల్లో పంచాయతీల నుంచి వచ్చే లైబ్రరీ సెస్సు చాలా తక్కువ. గ్రామాల్లో శాఖా గ్రంథాలయాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. చాలా వాటికి సొంత భవనాలు లేవు. అద్దె ఇళ్లల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి.

జిల్లాలో 26 పోస్టుల ఖాళీలు..

జిల్లాకు సంబంధించి మంజూరైన 44 పోస్టులకుగాను ప్రస్తుతం 18 మంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ లైబ్రెరియన్లు ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఎనిమిది మంది ఔట్‌సోర్సింగ్ విధానం కింద పని చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది అంతా పార్ట్‌టైమర్సే. చాలినంత మంది సిబ్బంది లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని పాలకులు..

గ్రంథాలయాల వ్యవస్థను ఒక ప్రభుత్వ శాఖగా కాక దానినొక సంస్థగా భావిస్తుండడం వల్ల పట్టింపు లేకుండా పోయింది. గ్రంథాలయ సంస్థలు రాజకీయ పదవులకు పునరావాస కేంద్రాలుగా మాత్రమే పనికొస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు అనుకూలమైన నామినేటెడ్ పదవుల పందారంలో భాగంగా చైర్మన్‌లను నియమించడంలో ఉన్న శ్రద్ధ వాటి నిర్వహణలో కీలకపాత్ర పోషించే సిబ్బందిని నియమించడంలో చూపడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సిబ్బందిని నియమించి గ్రంథాలయాల్లో పూర్తి సౌకర్యాలు కల్పించాలని పోటీ పరీక్షలు సిద్ధమవుతున్న అభ్యర్థులు కోరుతున్నారు.

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి..
: సునీత, డీఎస్సీ అభ్యర్థి



గ్రంథాలయాల్లో ప్రస్తుతం నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంటే బాగుంటుంది. డీఎస్సీ విభాగంలో సైకాలజీ, బిట్స్, కరెంట్ ఎఫైర్స్, తెలుగు, సోషల్, బయాలజీ విభాగాలకు సంబంధించి అప్డేట్ పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం పాత వాటితోనే ప్రిపేర్ అవుతున్నాం.

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..
: బుగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి



గ్రంథాలయంలో నెలకొన్న సిబ్బంది పూర్తి విషయాలను ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో ప్రభుత్వం పూర్తిస్థాయి నియామకాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

మోదీని పీఎం గా చూడడం ఖాయం

• ఎంపీ ధర్మపురి అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

కమ్మర్‌పల్లి, మార్చి 15: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగు వందల సీట్లలో విజయం సాధించి నరేంద్రమోదీని హాట్రిక్ పీఎంగా చూడడం ఖాయమని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మండలంలోని చౌట్‌పల్లిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు రానున్న ఎన్నికల విషయమై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం పసుపు ధరలు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. రైతుల కళ్లలో ఆనందం, మొఖాల్లో చిరునవ్వులు చిందిస్తున్నాయన్నారు. ప్రతిసారి దిగాలుగా ఉంటున్న పసుపు రైతుల్లో ఆనందాలు కనిపించడం తనకు సంతోషంగా ఉందన్నారు. త్వరలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయం నిజామాబాద్‌లోనే ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశంలో బీపీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు కట్టు సంజీవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గనులు, భూగర్భ శాఖ జిల్లా అధికారిగా విజయ్‌కుమార్

నిజామాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి బి.సత్యనారాయణ బదిలీ అయ్యారు. ఆయనను వికారాబాద్ గనుల శాఖ అధికారిగా నియమించారు. ఆయన స్థానంలో జగిత్యాలలో పనిచేస్తున్న విజయ్‌కుమార్ రాథోడ్‌ను జిల్లా అధికారిగా నియమించారు. ఆయనతో పాటు జిల్లాలో రాయాల్టీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న కె.ఆంజనేయులును కరీంనగర్‌కు, ఎండీ రైసొద్దీన్‌ను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. జిల్లాకు వరంగల్‌లో జనిచేస్తున్న కె.మధుసూదన్‌ను, సంగారెడ్డిలో పనిచేస్తున్న ఎం. రమేష్‌ను రాయాల్టీ ఇన్స్‌పెక్టర్‌గా నియమించారు.

నిజామాబాద్ డీడీగా మధుసూదన్‌రెడ్డి

గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పి.మధుసూదన్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయన నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు ఇంచార్జితో కొనసాగిన డిప్యూటీ డైరెక్టర్ పోస్టును ప్రభుత్వం ఎట్టకేలకు భర్తీ చేసింది.

పసుపుబోర్డు ఎగుమతితో ధరల పెరుగుదల : కిసాన్ మోర్చా



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా జిల్లా ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి

ముప్కాల్, మార్చి15: పసుపుబోర్డు ఏర్పాటు దేశంలో పసుపు ఎగుమతులు పెరగడంతో ఆశించిన స్థాయిలో పసుపు ధరలు పెరుగుతున్నాయని కిసాన్ మోర్చా జిల్లా ప్రెసిడెంట్ పొద్దుటూరి తిరుపతి రెడ్డి అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర మంత్రి పీయుష్ గోయాల్ చొరవతో జిల్లాకు పసుపుబోర్డు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలో దిగుమతి తగ్గడం, ఎగుమతులు గణనీయంగా పెరగడం, పసుపు ధర పెరుగుదలకు కారణమని, దిగుబడి పంట విస్తీర్ణం తగ్గిందని పసుపు రేటు పెరుగుతుందని అవగాహన లేని కొందరు మాట్లాడడం హాస్యాస్పదమని ఆయన మండిపడ్డారు. దేశంలో ఏడు లక్షల 72వేల ఎకరాలు విస్తీర్ణంలో పసుపు పండిస్తే మహారాష్ట్ర ఇంగోలి, నాందేడ్, బసుమతి ప్రాంతాల్లో పెరిగిందని వెల్లడించారు. పసుపు బోర్డు జిల్లాకు రాలేదని బోర్డు కారణం కాదని అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అంతేకాకుండా పసుపుబోర్డు ఏర్పాటుపై కేంద్ర కేబినెట్‌లో గెజిట్ విడుదల అయ్యిందని, బోర్డుకు చట్టబద్ధత కల్పిస్తూ జీవో వచ్చిందని పేర్కొన్నారు. అందుకు ఎంపీ అర్వింద్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేక చొరవ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రెసిడెంట్ అంబటి నవీన్, కిసానమోర్చ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట చిన్నయ్య, మండల ప్రధానకార్యదర్శి మీసాల చందు, గంగాధర్, అచ్చారం, వినోద్, పెండెం నర్సయ్య, కార్తిక్, కన్నారెడ్డి, ఐరా ప్రవీన్, సాయికిరణ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి విద్యుత్ శాఖ ఏడీఈ సస్పెన్షన్, ఏఈ బదిలీ

సుభాష్‌నగర్, మార్చి15: ఎడపల్లి ఏడీఈ, ఏఈల మధ్య గొడవ సస్పెన్షన్‌కు దారితీసింది. ఏడీఈ తనపై దాడిచేశాడంటు ఏఈ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఏడీఈ లక్ష్మణ్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈ ప్రసాద్ ను నిర్మల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెల్లడించారు. గత కొన్ని రోజుల క్రితం ఎడపల్లి ఏడీఈ కార్యాలయంలో వీరిద్దరు గొడవ పడ్డారు. ఈ ఘటనను సీరియస్‌గా ఉన్నతాధికారులు ఈ మేరకు విచారణ చేపట్టి ఒకరిని సస్పెండ్ మరొకరిని బదిలీ చేశారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బిగాల గణేష్ గుప్తా

ఆటోడ్రైవర్ స్వామి కుటుంబానికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి: మాజీ ఎమ్మెల్యే

సుభాష్‌నగర్, మార్చి15: ఆటోడ్రైవర్ స్వామి కుటుంబానికి 15లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఆటోడ్రైవర్‌లకు ప్రతీనెల 10వేల నుంచి 15 వేలు వేతనం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా కెనాల్ కట్ట ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ స్వామి ఇటీవల ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్ దంపతులు ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుమారుడు అనాథగా మిగిలాడన్నారు. రాష్ట్రంలో రోజుకోచోట ఆటోడ్రైవర్ ఆత్మహత్యలు చేసుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆటోడ్రైవర్ దంపతులు కుటుంబ పోషణ భారమై ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. స్వామి కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట బీఆర్ఎస్ నగర అధ్యక్షులు సిర్ప రాజు, కార్యదర్శి ఎనుగందుల మురళి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సూదం రవిచందర్, సుజిత్‌సింగ్, తదితరులు ఉన్నారు.

కృష్ణ మందిరంలో విగ్రహాల ఊరేగింపు

● ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించిన భక్తులు

డిచ్‌పల్లి, మార్చి 15: మండలంలోని మిట్టపల్లిలో గ్రామస్థులు నిర్మించిన శ్రీకృష్ణ మందిర ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను గ్రామప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన డా.ఈగ నర్సయ్య కుటుంబ సభ్యులు రూ. 10వేల విరాళం ఆలయ అభివృద్ధికి అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నర్సయ్య దంపతులను ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

మోర్తాడ్, మార్చి15: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ అన్న అజారుద్దిన్ శుక్రవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అంతేగాక ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు సంతోష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు తిమ్మాపూర్‌కు చెందిన డాక్టర్ ఎండి.కబీర్, మరికొందరు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజాపాలనలో భాగస్వామ్యం కావాలని, ప్రజలు కోరుకున్న పాలన కాంగ్రెస్ పార్టీ అందిస్తుందని కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని అన్నారు. పార్టీలో చేరిన వారిని ముత్యాల సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మహిపాల్, గురువయ్య, కుంట శ్రీనివాస్, రొక్కం మురళి, బద్దం రాజశేఖర్, ఎం.సురేష్, జక్కం అశోక్, సాయిరెడ్డి, దీరాజ్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీ, బీజేపీ నాయకులు

మోపాల్ సొసైటీ చైర్మన్‌గా గంగారెడ్డి ఏకగ్రీవం

మోపాల్, మార్చి 15: మండలంలోని మోపాల్ సొసైటీ చైర్మన్‌గా గంగారెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.మురళి తెలిపారు. గతంలో సొసైటీ చైర్మన్‌గా ఉన్న ఉమాపతిరావు ఇటీవల చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరో చైర్మన్‌ను ఎన్నుకునేందుకు సంబంధిత అధికారులు శుక్రవారం ఉదయం ఎన్నికలను నిర్వహించగా ముల్లంగి గంగారెడ్డి చైర్మన్‌గా నామినేషన్‌ను దాఖలు చేశారు. మరెవరూ చైర్మన్‌గా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. గంగారెడ్డి వెంట 11మంది డైరెక్టర్లు ఉన్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు గంగారెడ్డి వెంటనే ఉన్నారు. అధికారులు గంగారెడ్డి పేరును ప్రకటించడంతో సొసైటీ ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి సహకారంతోనే చైర్మన్‌గా ఎన్నికైనట్లు తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గంగారెడ్డిని నగేష్‌రెడ్డితోపాటు గంగాప్రసాద్, ప్రతాప్, సొసైటీ డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, నరేందర్, తిరుపతి సన్మానించారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగ అవకాశం

సుభాష్‌నగర్, మార్చి 15: ఇజ్రాయిల్‌లో నిర్మాణ కార్మికులు షటరింగ్, కార్పెంటర్, సిరామిక్ టైలింగ్‌లో పనిచేసేందుకు అవకాశాలు ఉన్నాయని జిల్లా ఉపాధి అధికారి సిరిమల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 16న జిల్లా ఉపాధి కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేయడానికి కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండి మూడు సంవత్సరాల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. వేతనం లక్షా 20వేల నుంచి లక్షా 38వేల వరకు ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 31 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో టామ్ కాన్ ఆధ్వర్యంలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మోర్తాడ్‌లో కాన్షీరాం జయంతి

మోర్తాడ్, మార్చి15: మండల కేంద్రంలోని పూలే విగ్రహం వద్ద బహుజన నాయకుడు కాన్షీరాం 90వ జయంతిని దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం కాన్షీరాం చిత్రపటానికి దళిత సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లూరి రాజారాం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బహుజన రాజ్యాధికారం కోసం తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత నాయకుడు బాబురావు, మామిడి గంగాధర్, రాజు, సందీప్, సృజన్, భూమన్న, మామిడి లింగయ్య, రాజు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో ఓటరు ప్రతిజ్ఞ, మానవహారం

ఆర్మూర్‌రూరల్, మార్చి15: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు ప్రతిజ్ఞ మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలను పురస్కరించుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మానవహారం నిర్వహించి నిష్పక్షపాతంగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, రవికుమార్, అనంత్‌రావు, లక్ష్మణ్, డాక్టర్ పోశన్న, జ్యోతి, సుజాత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, మార్చి15: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ లక్కం ప్రభాకర్ ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న గేదేజాతి, గోజాతి పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు ఆయన తెలిపారు. మామిడిపల్లిలో 650 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో వీడీసీసభ్యులు చిన్న రాజన్న, లక్కరం నరేష్, ప్రవీన్, శ్రావణ్, పశువైద్య సిబ్బంది, రాజేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, నాగార్జున, దివ్య, రాధ, గోపాల మిత్రలు రాజన్న, సురేష్‌లు పాల్గొన్నారు.

చకచకా ధర్మోరా ఎత్తిపోతల పనులు!



● ధర్మోరా ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే రెండు గ్రామాలకు లబ్ధి
● సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు ● రూ.11కోట్ల 70లక్షలతో నిర్మాణం పనులు

మాక్లూర్, మార్చి 15: గత కొన్నేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న ధర్మోరా ఎత్తిపోతల పథకం పనులు చకచకా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే మండలంలోని ముల్లంగి, బొంకన్‌పల్లి, మాదాపూర్ గ్రామాల రైతులకు లబ్ధి చేకూరనుంది. దీంతో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందనుంది. మే చివరి నాటికి పనులు పూర్తిచేస్తామని ఇరిగేషన్ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముల్లంగి, బొంకన్‌పల్లి గ్రామాలు నిజాంసాగర్‌సాగర్ చివరి ఆయకట్టు కావడంతో పంట భూములు సాగుకు నోచుకోక రైతులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా అదనపు పైప్‌లైన్ వేయాలని అధికారులు, పాలకులతో మొరపెట్టుకున్న ఫలితం దక్కలేదు. దీంతో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని గత ప్రభుత్వ హయంలో కేసీఆర్ సహకారంతో రూ.11కోట్ల 70కోట్ల నిధులు మంజూరు చేయించారు. రాజకీయ వైరాల కారణంగా పనులు నత్తనడకన సాగాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి చెందడంతో రైతుల ఒత్తిడితో పనులు చకచకా సాగుతున్నాయి. పంప్‌హౌజ్ పనులు 90 శాతం పూర్తి కాగా పైప్‌లైన్ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే బొంకన్‌పల్లి గ్రామంలోని 708 ఎకరాలు, ముల్లంగిలో 190 ఎకరాలు, మాదాపూ ర్‌లో 110 ఎకరాలకు సాగునీరు అందనుంది. మొ త్తానికి ధర్మోరా ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కావస్తుండడంపై గ్రామాల్లో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మే చివరి నాటికి పనులు పూర్తి చేస్తాం

● రవికుమార్, ఇరిగేషన్ డీఈ

ధర్మోరా ఎత్తిపోతల పథకం పనులు యుద్ధ ప్రతిపాదికన జరుగుతున్నాయన్నాయి. మే చివరి నాటికి పనులను పనులను పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తాం.

ప్రజాపాలన ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన డీపీవో



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో తరుణ్

రెంజల్, మార్చి 15: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీల అమలు ప్రక్రియ నిమిత్తం ప్రతీ గ్రామంలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలోని సవరణలను మండలప్రజాపరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. పథకాల ద్వారా ప్రతీపేదవాడికి లబ్ధి చేకూరేందుకు ప్రజాపాలన ద్వారా దరఖాస్తుల కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ ప్రక్రియ ద్వారా ఆన్‌లైన్ సవరణలను చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం నీలాలో తాగునీటి పైపులైన్ పనులను పరిశీలించారు. గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలో తాగునీరు సౌకర్యాల గురించి హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌస్, తదితరులు ఉన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా కలిగోట గంగాధర్

ఆర్మూర్‌టౌన్, మార్చి15: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా ఆర్మూర్‌కు చెందిన కలిగోట గంగాధర్‌ను నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలిగోట గంగాధర్ మాట్లాడుతూ తన నియామకానికి తోడ్పడిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, పార్లమెంటరీ ప్రభరి వెంకటరమణ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. ఆయనను పలువురు పట్టుశాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు.



నియామపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కాంగ్రెస్‌లో చేరిన బడాభీమ్‌గల్ ఎంపీటీసీ

భీమ్‌గల్ రూరల్, మార్చి15: భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన బడాభీమ్‌గల్ గ్రామ ఎంపిటిసి 2 కేతావత్ వల్లీ సంత్యాలి శుక్రవారం మోర్తాడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో పనిచేస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

మోస్రా, మార్చి15: మండలంలోని తిమ్మాపూర్ చే నెంబర్ తండా గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. బాన్సువాడ మాజీ జడ్పీటీసీ కొత్తకొండ భాస్కర్, మోస్రా పార్టీ మండల అధ్యక్షులు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్ అధ్యక్షతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా గజ్జి నారాయణ, ఉపాధ్యక్షుడిగా శేఖర్, మస్కూరి శ్రీనివాస్, కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా పెద్దిగారి రాములు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు బొజ్జ శ్రీనివాస్ గౌడ్, మండలయూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్, మోస్రాగ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ రికవరీ

రెంజల్, మార్చి 15: మండలంలోని నీలా గ్రామానికి చెందిన ముఖీమ్ గత కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దొంగలించబడిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని శుక్రవారం బాధితుడు ముఖీమ్‌కు ఏఎస్ఐ రవీందర్ అందజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ఉన్నారు.

చేయూత పథకం ఉపకరణాల పరిశీలన

కోటగిరి, మార్చి15: చేయూత పథకం కింద లబ్ధిదారులకు అందించిన ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. కోటగిరి మండలంలోని రాంపూర్, సుద్దులంలో బీసీ కార్పొరేషన్ కింద అందించిన చేయూత ఉపకరణాలను ఏ మేరకు ఉపయోగించుకుంటున్నారని పరిశీలించారు.

మోర్తాడ్‌లో డ్రైనేజీ పనులకు భూమిపూజ



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మోర్తాడ్, మార్చి15: మండల కేంద్రంలో రూ.10లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులను శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. తొలుత భూమిపూజ చేశారు. అనంతరం పనులు ప్రారంభించారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, మహిపాల్, గురువయ్య, నాగభూషణం, శ్రీధర్, మోహన్, రాజేందర్, రాకేష్‌గౌడ్, నవీద్, లక్ష్మణ్, జైడి చిన్న గంగారాం, పెద్ద గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

దేవునిగుట్టతండాలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కోటగిరి, మార్చి 15: కోటగిరి మండలంలోని దేవుని గుట్ట తండా గ్రామంలో శుక్రవారం సిమెంటు రోడ్డు పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ప్రత్యేకంగా ఎన్ఆర్‌జీఎస్ పథకంలో రూ.5లక్షల మంజూరు చేయించారన్నారు. సీసీ రోడ్డు పనులలో నాణ్యత ప్రామాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, జైపాల్, కిషన్, యశ్వంత్, రవి, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ, అవగాహనపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న అధికారి

డొంకేశ్వర్, మార్చి15: డొంకేశ్వర్ మండలంలోని నడ్కుడ, గాదేపల్లి శివారులో ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో 120మంది జిల్లా అటవీ అధికారులకు వన్యప్రాణుల సంరక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫారెస్టు డివిజన్ ఆఫీసర్ భవాని శంకర్ హాజరయ్యారు. వన్యప్రాణుల యొక్క ఆవశ్యకతను వాటి సంరక్షణ విధానాన్ని క్షేత్రస్థాయిలో సిబ్బందికి వివరించారు. ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ జీవాలపైన ఫారెస్ట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ పెరిగే క్రమంలో ఇక్కడ ఉన్న జంతువులకు సరైన స్థలం దొరకాక పొలాలో ఉండే విద్యుత్ వైర్లకు తగిలి మృత్యువాతపడుతున్నాయన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఉపాధి దొరకాడంతోపాటు వన్యప్రాణులకు రక్షణ కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, పద్మరావు, రవిమోహన్, రవీంధర్, వినయ్ నాయక్, డిప్యూటీ రెంజ్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా

నవపేట, మార్చి 15: గత ఆరు మాసాలుగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని వివిధ గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గత ఆరు మాసాలుగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

'కవిత అరెస్టు హేయమైన చర్య'

ధర్పల్లి, మార్చి 15: ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం హేయమైన చర్య అని ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి అభివర్ణించారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆమె స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఈడీ చేత కేంద్ర ప్రభుత్వం దిగజారుడు చర్యలకు పూనుకుంటుందని ఆరోపించారు. కవితను వెంటనే బేషరత్తుగా విడుదల చేయాలని లేనిపక్షంలో బీఆర్ఎస్ శ్రేణులు ఉద్యమిస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజ్‌పాల్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, పోతరాజు, సురేష్, నర్సయ్య పాల్గొన్నారు.

'నాలుగు నెలల వేతనాలు చెల్లించాలి'



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వర్ని, మార్చి 15: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే కాంట్రాక్ట్ వర్కర్ల 4 నెలల బకాయి వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని శుక్రవారం తెలంగాణ హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వర్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్దతుల్లో పని చేసే కార్మికుల నాలుగు నెలల బకాయి వేతనాలు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీస వేతనం రూ26వేల వేతనం చెల్లించి, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వర్ని ఏరియా అధ్యక్షురాలు సుశీల, ప్రధాన కార్యదర్శి సావిత్రి, కోశాధికారి బాల ప్రసాద్, ఉపాధ్యక్షురాలు కొండబాయి, సహాయ కార్యదర్శి బాలమణి తదితరులు పాల్గొన్నారు.

బినోల సొసైటీ మహజన సభ

నవీపేట, మార్చి 15: మండలంలోని బినోల సొసైటీ మహజన సభను శుక్రవారం సొసైటీలో నిర్వహించారు. ఏప్రిల్ 2023నుండి సెప్టెంబర్ 2023వరకు సంఘం నిర్వహించిన ఆర్థిక లావాదేవీలను కార్యదర్శి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా నాడాపూర్, తుంగిని, సిరన్‌పల్లి, గాంధీనగర్‌లలో నూతనంగా గోదాములను నిర్మించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్, పలువురు డైరెక్టర్లు, కార్యదర్శి, సంఘం సభ్యులు ఉన్నారు.



మహజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ హన్మాండ్లు

అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములు!

● రామాలయానికి చెందిన 45 ఎకరాల ఆలయ భూముల్లో ఇతరుల సాగు ● పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు

డిచ్‌పల్లి, మార్చి 15: ఆ ఆలయ 187 ఏళ్ల క్రితం నిర్మించినది. అప్పట్లో ఒక వెలుగు వెలిగిన ఆలయం నేడు కళాహీనంగా మారింది. ఇందల్వాయి రామాలయానికి చెందిన భూములు డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి, గ్రామాల శివారులో సుమారు 45 ఎకరాలకు పైగా ఉన్నాయి. కానీ దేవాలయ శాఖ ఈ భూములపై శ్రద్ధ చూపని కారణంగా దేవుని మాన్యం కబ్జా కోరల్లో చిక్కింది. ఆలయం శిథిలావస్థకు చేరినా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో ఆలయం కూలిపోయే దశకు చేరుకుంది ఇప్పటికే కల్యాణ వేదిక, సత్రాలు, యజశాల, మండపాలు, కూలీ పోయే దశకు చేరుకున్నాయి. గత 2ఏళ్ల క్రితం నాటి రాష్ట్ర దేవాలయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గ్రామస్థుల కోరికా మేరకు ఆలయం సందర్శించారు. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ఇంత వరకు హామీ నేరవేర్చలేదు. ప్రభుత్వం సైతం మారిపోవడం ఆ విషయం కాస్తా మూలన పడింది. గ్రామస్థులు, భక్తులు, అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను తమ పేర పట్టాలు చేసుకునేందుకు కబ్జా రాయుళ్లు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ భూ ములపై కోర్టులో న్యాయ పరిష్కారం కోసం దేవాలయ శాఖ అధికారులు కేసులు వేశారు.

● తిరిగి భూములను స్వాధీనం చేసుకుంటాం: ప్రభాకర్, తహసీల్దార్

రామాలయానికి చెందిన భూముల్లో కొందరు వ్యక్తులు సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి చెందిన భూములు కబ్జాలో ఉన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకొనుంది. ప్రభుత్వ భూములను ఎవరూ కబ్జా చేసిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.



సుద్దులం, కోరట్‌పల్లి శివారులోని ఆలయ భూముల్లో సాగు అవుతున్న వరి



బోధన్‌లో సంబరాలు చేసుకుంటున్న కమ్మ సంఘం నాయకులు

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై సంబరాలు

బోధన్ రూరల్, మార్చి15: రాష్ట్ర ప్రభుత్వం కమ్మ కుల కార్పొరేషన్ ఏర్పాటుచేయడంతో కమ్మ సంఘం నాయకులు బోధన్‌లో సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బోధన్ డివిజన్ కమ్మసంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీమంత్రి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలుపుతూ బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శివన్నారాయణ, ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ చౌదరి, ప్రతినిధులు యార్లగడ్డ శ్రీనివాస్‌రావు, నాగేశ్వర్ రావు, బాల గంగాధర్, హరిబాబు, భాస్కర్, హనుమంతు రావు, శ్రీనివాస్, గాంధీ, రమేష్, రామాంజనేయ చౌదరి, సురేష్ ఉన్నారు.

వర్ని: కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు జీవో విడుదల చేయడంపై మండలకేంద్రంలో శుక్రవారం కమ్మసంఘం ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల సంఘం జిల్లా నాయకులు పల్లంపాటి శివన్నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌టీఆర్ విగ్రహంకు పూలమాలలు వేసి ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. కార్యక్రమంలో గణపతి, దొరబాబు, రెడ్డి వీర్రాజు, నవీన్, వంకా నగేష్, నవీన్ రెడ్డి, శివ నాగేశ్వర రావు పాల్గొన్నారు.

● కురుమ సంఘం ఏర్పాటుపై సీఎంకు క్షీరాభిషేకం

బోధన్ రూరల్: రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో కురుమ సంఘం కార్పొరేషన్ ఏర్పాటుపట్ల బోధన్ నియోజకవర్గ కురుమ సంఘం సభ్యులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బోధన్ మండల కురుమ సంఘం నాయకులు దేవరావు, వీరయ్య, రవి, శంకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి రజోత్సవ ఊరేగింపు

బోధన్‌రూరల్, మార్చి15: పట్టణంలోని బసవ తారకనగర్‌లో గల కోట మైసమ్మ సంయుక్త లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్వామి విగ్రహాలతో ఘనంగా రజోత్సవ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పసులోటి గోపికిషన్, సీఐ వీరయ్య పాల్గొన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

నిజామాబాద్ లీగల్, మార్చి15: నిజామాబాద్ బార్ అసోసియేషన్ 2024-25 వార్షిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రధాన ఎన్నికల అధికారి అమిదాల సుదర్శన్, సహాయ ఎన్నికల అధికారి నారాయణదాసు శుక్రవారం విడుదల చేశారు. జిల్లా బార్ అసోసియేషన్‌లో 500 పైగా న్యాయవాదులు ఉండగా, ఓటరు జాబితా ప్రకారం 398మంది న్యాయవాదులు ఓటుహక్కు కలిగి ఉన్నారని తెలిపారు. మార్చి 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన, 22న అభ్యర్థులను ప్రకటన, 28న జిల్లా కోర్టు బార్ ఛాంబర్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 10మంది కార్యవర్గ సభ్యులకు కూడా నామినేషన్లు స్వీకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు దేవదాస్‌చందక్, ప్రధాన కార్యదర్శి బాగిచరణ్, న్యాయవాదులు బండారి కృష్ణానంద్, జి.తులసీదాస్, జె.వెంకటేశ్వర్లు, జాన్సిరాణి పాల్గొన్నారు.

పట్టా భూములు చూపించాలని ధర్నా

ధర్పల్లి, మార్చి15: మండలంలోని రామడుగులో అధికారులు తమకు పట్టాలు ఇచ్చి భూమిని కేటాయించకపోవడంపై నిరుపేదలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ రామడుగులో 1150 సర్వేనెంబర్‌లో 250 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అప్పటిప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, కానీ అప్పటి నుంచి భూమి కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యం చేశారని అన్నారు. సర్వే నిర్వహించి సీఎల్‌డీపీ కింద భూమిని అభివృద్ధి చేసేందుకు నిధులు సైతం గతంలోనే మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పుడు ఆ భూమిలో సాగు చేసేందుకు వెళ్తే ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని, పేదలకు కేటాయించిన భూములు అప్పజెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.రమేష్, అనిష్, దామోదర్, లింబన్న పాల్గొన్నారు.

నర్సరీలను తనిఖీ చేసిన ఎంపీడీవో

మోపాల్, మార్చి15: మండలంలోని కులాస్‌పూర్‌లో ఏర్పాటుచేసిన నర్సరీలను శుక్రవారం ఎంపీడీవో లింగం తనిఖీ నిర్వహించారు. ఎండ తీవ్రత ఎక్కువ అవుతున్నందున నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీవో ఆదేశించారు. నర్సరీలో ఉన్న మొక్కలకు ప్రతీరోజు నీటిపట్టాలని సూచించారు. అలాగే కంజర్ గ్రామంలో కూడా నర్సరీ సెంటర్లను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచించారు. చిన్నాపూర్‌లో నీటి సమస్య లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్థాయి అధికారులకు ఆదేశించారు. ఈ గ్రామంలో నీటిసమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు తమదృష్టికి తెచ్చారని తెలిపారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో లింగం

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పాటు పడాలి

● అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

సుభాష్‌నగర్, మార్చి15: వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సంబంధిత శాఖల అధికారులు అంకితభావంతో కృషిచేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పౌరసరఫరాల శాఖ సివిల్‌సప్లై ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని వినియోగదారుల హక్కులు, బాధ్యతలను తెలియజేస్తూ చట్టపరిధిలో ఎలాంటి సేవలు పొందవచ్చు. ఎవరికి ఫిర్యాదు చేయాలి అనే అంశాలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రతినిధులను సైతం రప్పించి వివిధరకాల వస్తువుల నాణ్యతవాటి ప్రమాణాల గుర్తింపు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వినియోగదారుడు తనహక్కులు, బాధ్యతలు తెలుసుకున్నప్పుడే నాణ్యమైన వస్తువులు సంతృప్తికర సేవలు పొందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఏదైనా సందర్భంలో మోసాలకు గురైతే న్యాయం పొందేందుకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలు దోహదపడుతాయన్నారు. కృత్రిమ మేదస్సును బాధ్యతాయుతంగా వినియోగించుకుంటే అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. దుర్వినియోగం అయితే దుష్పరిణామాలు తీవ్రస్థాయిలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లై అధికారులు జగదీశ్, డీఈవో దుర్గాప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుదర్శనం, తూనికలు, కొలతల శాఖ అధికారి నిర్మల్ కుమార్, ఔషద నియంత్రణ అధికారి శ్రీలత, వినియోగదారుల సమైక్య అధ్యక్షుడు ఎం.రాజేశ్వర్, గుజ్జరాజేశ్వరి, తదితరులున్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

మండలంలో రూ.కోటితో సీసీ రోడ్డు పనులు

ధర్పల్లి, మార్చి15: మండలంలోని 22 గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు పనుల కోసం కోటి రూపాయలు నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మంజూరు చేశారు. శుక్రవారం వివిధ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మొదటి విడతగా సీసీ రోడ్ల కోసం జాతీయ ఉపాధి హామీ నిధుల నుంచి ఈ మొత్తాన్ని కేటాయించారు. సీసీ రోడ్డు పనులు మార్చి చివరివరకు పూర్తి చేయాలని అధికారులు సూచించారు. నాణ్యతాయుతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, గాదారి మనోహర్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

జంతువులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిది



వన్యప్రాణుల చిత్రాలను చూపుతున్న జిల్లా న్యాయాధికారి

నిజామాబాద్ లీగల్, మార్చి 15: జంతువుల జీవనాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీపౌరుడిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత కుంచాల అన్నారు. జిల్లా ఎన్విరాన్‌మెంట్ వైల్డ్‌లైఫ్ సొసైటీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది మంతాని రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి క్యాంతమ్ సంతోష్, కోశాధికారి హితెన్‌బాయ్, సభ్యులు దర్శన్‌సింగ్, కట్కం శ్రీనివాస్‌లతో కలిసి తన ఛాంబర్‌లో వన్యప్రాణుల సంరక్షణ పోషణ అనే ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ ఎగువ ప్రాంతంలో జలాశయం తగ్గుదల వల్ల వన్యప్రాణులు కృష్ణ జింకలు, ఫ్లేమింగ్ బర్డ్స్ లాంటి పశుపక్షాదులు కనబడే వలిసివచ్చే సమయంలో వాటి జీవనశైలికి హాని చేయొద్దని అన్నారు. ఉమ్మడి జిల్లాలో శ్రీరాంసాగర్, పోచారం, మంచిప్ప అటవీప్రాంతాలతోపాటుగా ఇతర ప్రాంతాల్లో వన్యప్రాణులను వనంలో సురక్షితంగా ఉండే విధంగా స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్విరాన్‌మెంట్ వైల్డ్‌లైఫ్ సొసైటీని ఆదర్శంగా తీసుకొని పర్యావరణ వన్యప్రాణుల రక్షణలో పాత్రులు అవుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆశా నారాయణ, మానిక్‌రాజు, న్యాయసేవా సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ఏర్గట్ల, మార్చి15: మండలకేంద్రంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సీసీ రోడ్లకు 20లక్షలు మంజూరు కావడంతో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. నిధులు మంజూరీ చేసిన ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలుతెలిపారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులున్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌కు విద్యార్థికి ఎంపిక

డిచ్‌పల్లి, మార్చి15: ఈనెల 14నుంచి 16వరకు ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో జరుగుతున్న 8వ రాష్ట్ర సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థిని చెలిమెటి అమూల్య ఎంపికైనట్లు హెచ్‌ఎం సుశీల్‌కుమార్‌తెలిపారు. అమూల్య జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.



నీటి శుద్ధి యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

మురుగునీటి శుద్ధి కేంద్రం పరిశీలన

సుభాష్‌నగర్, మార్చి15: నగరంలోని ఖానాపూర్ రోడ్‌లోగల భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని అన్నారు. అమృత్ పథకం ద్వారా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూ.30కోట్లు, వాటర్ సప్లైకి రూ.98 కోట్ల ఖర్చుతో 2017లో ప్రారంభమై 2020 వరకు పూర్తిచేయడం జరిగిందన్నారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని నగరంలో వర్షాకాలం వస్తే ప్రజలు డ్రైనేజీతో నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ 2.0 ద్వారా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి 162.81 కోట్లు, వాటర్ సప్లైకి 217కోట్లు విడుదల చేశారని అన్నారు. ప్రస్తుతం అవి టెండర్‌స్థాయిలో ఉన్నాయని ప్రభుత్వంతో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తిచేసి ఏడాదిలో ప్రజలకు అందుబాటులోకి తెస్తానని హామీఇచ్చారు. ఈ యంత్రాల ద్వారా మురుగునీటిని శుద్ధి చేసి ఆ నీరును వ్యవసాయానికి వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఏఈ తిరుపతి, డీఏఈ నాగేష్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ యోగేష్,కార్పొరేటర్లు బీజేపీ నాయకులున్నారు.

అవినీతిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలి

ఆర్మూర్‌టౌన్, మార్చి 15: గత నాలుగేళ్లుగా ఆర్మూర్ మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై కలెక్టర్ విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని బీజేపీ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లోని డీజిల్ బిల్లు, బిల్డింగ్ రిపేర్‌ల పేరుపై లక్షల రూపాయల నాసిరకం పనులు చేశారని అన్నారు. ఇరిగేషన్, అసైన్డ్ లేఅవుట్ కానీ స్థలాల్లో ఓపెన్ ప్లాట్లకు ఇంటి నెంబర్‌లు కేటాయించి కోట్ల రూపాయలు ప్రభుత్వఆస్తిని గత పాలకవర్గం దోపిడీ చేసిందని, వీటిపై కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ సమావేశంలో విజిలెన్స్ విచారణ కోరామని, తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకొని విజిలెన్స్ విచారణ ఆదేశించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయికుమార్, తదితరుల్లున్నారు.



మాట్లాడుతున్న బీజేపీ ఫ్లోర్ లీడర్

మున్సిపల్ సమావేశంలో పలు తీర్మానాలు

ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి చైర్మన్ షేక్ మున్న అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్‌లు, డీఈ భూమేశ్వర్, ఏఈ రఘు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి

ఎడపల్లి, మార్చి15: మండలంలోని అంబం(వై) పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై అదే గ్రామానికి చెందిన పవన్ దుర్భాషలాడుతూ దాడి చేశాడు. కార్యదర్శి శ్రీనివాస్‌పై ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు. కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ శుక్రవారం విధుల్లో ఉన్న తన వద్దకు గ్రామస్థుడు పవన్ వచ్చి తమ ఇంటి వద్ద గల విద్యుత్ స్తంభానికి విద్యుత్ బల్బ్ పెట్టాలని కోరగా.. రెండుమూడు రోజుల్లో ఏర్పాటు చేస్తామని చెప్పినట్లు తెలిపాడు. ఆ వెంటనే తనను బూతులు తిడుతూ తనపై దాడి చేసినట్లు పేర్కొన్నాడు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసేందుకు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకోగా తన వెనుకాలే వచ్చి ఫైళ్లను లాక్కొని అందరూ అధికారులు చూస్తుండగానే కుర్చీతో నాపై దాడిచేసినట్లు చెప్పాడు. ఎంపీడీవో గోపాలకృష్ణ వారించగా తలాను జర్నలిస్టుని, ఏం చేస్తారని అని ఎంపీడీవోపై వాగ్వాదానికి దిగాడు. తనపై దాడి చేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరాడు.

మద్యంతాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

ఖిల్లా, మార్చి15: మద్యం తాగి వాహనం పడిని ఓ వ్యక్తికి మూడురోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందిని శుక్రవారం ట్రాఫిక్ ఎస్సై వెంకటనారయణ ఉదయం కోర్టు ఎదుట హాజరుపర్చారు. వీరికి మెజిస్ట్రేట్ సయ్యంద ఖదీర్ రూ.18300 జరిమానా విధించడమే కాకుండా వీరిలో ఒకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. ఈనెల 13న ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి రవికృష్ణరెడ్డి మద్యం తాగి వాహనం నడిడుపుతుండగా పట్టుకుని కోర్టులో హాజరుపర్చగా ట్రాఫిక్ ఏసీపీ ఏ.నారాయణ తెలిపారు.

మాక్‌పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన

ఏర్గట్ల, మార్చి15: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మాక్‌పోలింగ్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఉపాధ్యాయులు గంగాధర్ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా విద్యార్థలకు మాక్ పోలింగ్‌లో తమ నాయకుడి ఎలా ఎన్నుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, సుధాకర్, రాములు,నాగప్ప, స్వప్న పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు



డొంకేశ్వర్‌లో కాన్షిరాం చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

ఘనంగా కాన్షిరాం జయంతి

సుభాష్‌నగర్, మార్చి 15: డీఎస్‌పీ ఆధ్వర్యంలో మాన్యావార్ కాన్షిరాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో కాన్షిరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సుమన్ మహారాజ్ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో బహుజన వర్గాలకు అధికారం అందించి బాబా సాహెబ్ అంబేడ్కర్ కోరుకున్న సర్వసమాజ స్థాపనకు కాన్షిరాం కృషి చేశారని కొనియాడారు. డీఎస్‌పీ ద్వారా మళ్లీ కాన్షిరాం కలలు సాకారం కాబోతున్నాయని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, అగ్రకుల ప్రజాస్వామ్య వాదులు అందరూ డీఎస్‌పీలోకి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, స్వామి, గణేష్, మేఘరాజ్, రాజేంద్రప్రసాద్, వివిధ మండలాల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండలకేంద్రంలోని బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కాన్షిరాం జయంతిని ఘనంగా నిర్వహించారు. బహుజన సమాజానికి రాజాయధికారిన్ని అందించిన మహానీయుడని కొనియాడారు. ప్రతీఒక్కరు ఆయన అడుగుజాడల్లో నవాలని సూచించారు. ఈ సందర్భంగా కాన్షిరాం చిత్రపటానికి బీఎస్పీ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సుంకరి నాగరాజు, నందిపేట, డొంకేశ్వర్ మండలాల అధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



యాద్గార్‌పూర్‌లో టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేడీఏ

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలి: జేడీఏ

కోటగిరి, మార్చి15: పశువులకు తప్పనిసరి గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి సూచించారు. మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో శుక్రవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జీవాల యాజమానులు గాలికుంటు వ్యాధిపట్ల నిర్లక్ష్యం చేస్తే పశువులు మరణించే అవకాశం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో ఏడీ బాలిక్ అహ్మద్, బస్వారెడ్డి, మండల పశు వైద్యాధికారి సురేష్ కుమార్, మంజుల, సుధీర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య

ఇందల్వాయి, మార్చి15: ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంగల్‌పాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోగల పాటితండాలో కవిత (24) వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేగ్యానాయక్ తండాకు చెందిన కవితకు పాటితండాలోని బాల్‌సింగ్‌తో వివాహం కాగా వీరికి కుమారుడు, కూతురున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు మేగ్యానాయక్ తండా నుంచి వచ్చి ఆందోళన చేశారు. దీంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వారిని శాంతింపజేసినట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా పూర్తివివరాలు తెలియాల్సి ఉందని వెల్లడించారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 270

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.66,300	రూ.61,150	రూ.775

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : యోధ (హిందీ, ఇంగ్లీష్) (10.10, 1.10, 7.10, 10.10)
- స్క్రీన్-2 : కుంగుఫూ పాండా4 (ఇంగ్లీష్) (12.05, 2.25, 8.00) : ప్రేమలు (4.45) : రజాకర్ (10.20)
- స్క్రీన్-3 : గామి (10.25, 7.20) : సైతాన్ (హిందీ, ఇంగ్లీష్) (1.35)
- స్క్రీన్-4 : తంత్ర (10.30), : బాస్టర్ ద నక్సెల్ స్టోరీ (హిందీ) (1.25) : భీమా (4.15), : సైతాన్ (హిందీ, ఇంగ్లీష్) (7.20, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : ప్రేమలు (1.30, 7.30) : షరతులు వర్తిస్తే (4.40)
- స్క్రీన్-2 : రజాకర్ (10.40), యోధ (హిందీ) (1.40) : గామి (4.30, 10.40) : భీమా (7.40)
- స్క్రీన్-3 : రజాకర్ (1.35, 7.20) : యోధ (హిందీ) (4.35, 10.20)

- దేవి : ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
- లలితమహల్ : భీమా (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : తంత్ర (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్